# ప్రజాస్వామ్య బూటకత్వాన్ని మరోసారి చాటిచెప్పిన కర్నాటక ఎన్నికలు

**కర్నాటక** రాష్ట్రంలో ప్రభుత్వాధికారం చేజిక్కించుకునేందుకు పాలకవర్గ పార్టీల నడుమ పోటీ-ఎత్తులు పైఎత్తులు, మోసకారీతనాలతో భావోద్వేగపూరిత నాటకీయ మలుపులు తీసుకొని, చివరికో ముగింపుకొచ్చింది.

కాంగ్రెస్, జెడియస్‌ల కూటమి, ఈ కూటమిలో విజయం పొందింది. న్యాయానికి, ప్రజాస్వామ్యానికి, భారత రాజ్యాంగానికే గొప్ప విజయంగా దీనిని వారు కీర్తించారు. కర్నాటక సంక్షోభంలో సుప్రీంకోర్టు సరిగ్గా సమయానికి, సహకారిగా జోక్యం చేసుకోవడంపై వారు పొగడ్తల వర్షం కురిపించారు.

కర్నాటక రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలలో ఏకైక అతిపెద్ద పార్టీగా విజయం సాధించిన బిజెపి తమకు మాత్రమే ప్రభుత్వాన్ని ఏర్పరచగలిగే నైతిక అర్హత వుందని, పట్టువిడవకుండా తన వాదనను కొనసాగించింది.

కర్నాటక రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెలువడటం ప్రారంభమైన నాటినుండి కాంగ్రెస్, జెడిఎస్‌ల కూటమి ప్రభుత్వాన్ని ఏర్పరచే చివరి అంకందాకా మనదేశంలోని ప్రజలు, ప్రజాస్వామిక శక్తులు రోతపుట్టించే వారి యావత్ నాటకాన్ని వీక్షించారు.

ఎన్నికలు పూర్తయి ఫలితాలు వెలువడిన తర్వాత, బిజెపి ఒకే సమస్యను ఎదుర్కొంది: 104 సంఖ్యను 111కు పెంచుకోవటమెట్లా అనేదే! దీనికి వాస్తవరూపమివ్వటానికి కాంగ్రెస్, జెడిఎస్‌ల నుండి బిజెపి 7 గురు ఎంఎల్‌ఏలను కనీసంగా రాబట్టు కోవాలి. బిజెపి నాయకత్వం వుపయోగించిన మరొక పద్ధతంటూ ఏమీ లేదు. కాంగ్రెస్, జెడిఎస్ ఎంఎల్‌ఏలకు భారీస్థాయి ఆశలు తచూపింది; వత్తిళ్ళు, బెదిరింపులు సాగించింది; పుకార్లను వ్యాప్తిచేసింది; కొందరు ఎంఎల్‌ఏలను అపహరించి, విశ్వాస తీర్మానంనాడు వారిని అసెంబ్లీకి చేరుకోకుండా దాచివుంచి, గైర్హాజరుపరచాలని ప్రయత్నించింది. అలవిమాలిన అధికారదాహంతో, చివరి నిముషం వరకు అది అనుభవించిన తీవ్ర ఉద్రిక్తతను చూచి తీరవలసిందేగానీ, మాటలలో వర్ణింపసాధ్యంకానిది.

కాంగ్రెస్, జెడిఎస్‌ల కూటమి నాయకులు కూడా ప్రశాంతంగా గడపగలిగారని చెప్పలేం. శత్రువుకు అందనంత దూరంలో, రాష్ట్రానికి వెలుపల వారు తమ 'మెజారిటీ'ని దాచివుంచుకున్నారు. చివరి నిముషం వరకూ అంతా ప్రశాంతంగా జరిగి పోతుందని వారేమాత్రం నమ్మకంతో లేరు. అనూహ్యావేగంతో, పథకంతో వారు కదిలారనేది నిస్సందేహం. అయితే గణాంకాలలో చివరి నిముషంలో మార్పులు బిజెపిని ఘోరపరాజయం పాల్జేసింది.

భారత రాజ్యాంగం ప్రకారం, ప్రజాస్వామ్యం ప్రకారం ప్రభుత్వాన్ని ఏర్పరచటం ఓ పెద్ద హాస్యాస్పదంగా మారిపోయింది. అధికారంకోసం పోటీపడే పార్టీలు ఎన్నికైన సభ్యులను అమ్మకం, కొనుగోలు చేయదగిన సరుకులుగా భావిస్తాయని, వ్యవహరిస్తాయనేది వాస్తవం. ఈ 'సరుకు'ను లాకర్లలో భద్రపరిచి అవసరమైనప్పుడు అందుబాటు లోకి తీసుకొచ్చే ఈ ప్రహసనం-మన ప్రజాస్వామ్య స్వభావపు దిగజారుడు దృష్టాంతంగా వుంది. మనదేశంలో చట్టబద్ధ సంస్థలకు ఎన్నికలనేవి- అధికారపీఠాన్ని ఎవరు అధిరోహిస్తారో నిర్ణయించే సందర్భాలను, వేదికలను పాలకవర్గ పార్టీలకు కల్పిస్తున్నాయి. ఈ పార్టీలన్నీ దళారీబూర్జువా వర్గానికి, భూస్వామ్యవర్గానికి, సామ్రాజ్యవాదానికి సేవచేసేవే! అయితే ఈ పార్టీలేవీ, ఈ వాస్తవాన్ని ప్రజలకు చెప్పవు. ఎన్నికల సమయంలో, అభివృద్ధి, సంక్షేమం మొదలైన వాటితో ప్రజలకు అరచేతిలో వైకుంఠం చూపుతాయి. ప్రజలపై తక్షణ ఉపశమనాలను, వాగ్దానాలను కురిపించటంలో అవి పోటీపడ్తాయి. కులం, మతం, ప్రాంతం మొదలైన వాటిని ఉపయోగించుకుంటూ, అవి ప్రజలలో భావోద్వేగాలు, అపోహలు పెంచుతాయి; ఓట్లను దండుకునేందుకు ప్రజలను వాస్తవిక సమస్యల నుండి ప్రక్కకు మళ్ళిస్తాయి. డబ్బు, బహుమతులు విసిరి ప్రజలను అవినీతిమయం చేయజూస్తాయి. అధికారంకోసం కొట్లాడుకునే ఈ పార్టీలన్నీ ఎన్నికలలో తమ ఓటమి, విజయాలతో నిమిత్తం లేకుండా సామ్రాజ్యవాదుల, వారి దళారీల ప్రయోజనాలకు నిరంతరాయంగా సేవజేస్తామని హామీ ఇస్తాయి.

కర్నాటకలో బిజెపి ఒకవైపు, కాంగ్రెస్- జెడిఎస్‌ల కూటమి మరోవైపు అధికారంకోసం పోటీపడ్డాయి. కేంద్రంలో అధికారంలోనున్న బిజెపి, సామ్రాజ్యవాదానికి, దళారీ బూర్జువా వర్గానికి, భూస్వామ్య వర్గానికీ అంకితభావంతో సేవచేస్తున్నది. ప్రజలను విభజించటానికి, వారిని ప్రక్కదోవ పట్టించటానికి ఒక సాధనంగా, తద్వారా భూస్వామ్య, సామ్రాజ్యవాద అనుకూల విధానాలను అమలుచేయటానికీ హిందూమతత్వమనే సాధనంతో బిజెపి దూకుడుగా సాగుతోంది. కర్నాటకలో బిజెపి అవినీతికి ప్రతిరూపంగా నిరూపితమైంది. కల్బుర్గి, గౌరీలంకేష్‌ల వంటి ప్రజాస్వామికవాదుల, మేధావుల క్రూరహత్యలకు వెనుకనున్న శక్తి బిజెపీ అనేది వాస్తవం. కర్నాటకలో తమ విజయాన్ని ఒక సవాల్‌గా తీసుకొని, అఖిలభారత స్థాయిలో మసక బారుతున్న తమ ప్రతిష్టకు ఇది అడ్డుకట్టవేయగలదని ఆశించింది. కనుకనే, నరేంద్రమోడీ మరియు కేంద్రస్థాయి నాయకులు కర్నాటక ఎన్నికలలో తమ అత్యధిక సమయాన్ని వినియోగించటంతోపాటు, ఓటర్లను ప్రభావితం చేయటానికి అత్యంత హీన స్థాయికి దిగజారి వ్యవహరించారు. కాంగ్రెస్‌పార్టీ కర్నాటక ఎన్నికలలో తమ గెలుపును అఖిలభారత స్థాయిలో తిరిగి కోలుకునేదిశగా ఒక అడుగు ముందుకు వేయటానికి వుపయోగించుకోవాలను కుంది. కాంగ్రెస్‌పార్టీ కులతత్వాన్ని, మత భావనలను వుపయోగించటంతోపాటుగా ఓటర్లను ప్రభావితం చేసేలా వాగ్దానాలు చేసింది. లింగాయతులకు ప్రత్యేక మతహోదా కల్పిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న చర్య కూడా ఓట్లను దండుకోవడానికి మతాన్ని ఉపయోగించుకునే తన చర్యల్లో భాగమే. బిజెపి హిందూమతత్వాన్ని కాంగ్రెస్ వ్యతిరేకిస్తుందని చెబుతూ అదే సమయంలో హిందూ ఓట్లలో 'తగిన వాటా' కోసమూ, హిందూ మతంయొక్క రక్షకులుగా వ్యవహరించటమూ ఇందులో భాగమే. నిర్దిష్ట కులాల,

మత సమూహాలపై జెడిఎస్ ఆధారపడి వుంది. ఒక రాజకీయపార్టీగా ఏదో ఒక సమయంలో అది అధికారంలో కొనసాగింది. కర్నాటకలో ఏదో ఒక సమయంలో అధికారం వెలగబెట్టిన ఒకపార్టీగా, ప్రజావ్యతిరేక, అవినీతికర విధానాలకు జెడిఎస్ 'ఖ్యాతి' గడించింది.

ఎన్నికల ఫలితాలు వెల్లడైన వెనువెంటనే, కాంగ్రెస్–జెడిఎస్‌లు కూటమిగా ఏర్పడి బిజెపిని అననుకూల స్థితిలోకి నెట్టివేశాయి.

తన నీచమైన ఎత్తుగడలు ఫలించక కర్నాటకలో ఓటమిని చవిచూడటం–అఖిలభారత స్థాయిలో అధికారంకోసం బిజెపి చేస్తోన్న ప్రయత్నాలకు గండికొట్టిందనటంలో సందేహం లేదు. దేశంలో హిందూ మతతత్వాన్ని, ప్రజాస్వామ్య వ్యతిరేక విధానాలను దూకుడుగా అమలుచేస్తున్న బిజెపి, వారి సంఘ్‌పరివార్‌లను, మరియు నాయకత్వంలోని ప్రభుత్వాలను వ్యతిరేకిస్తున్న అనేక మంది కొంతమేరకు దీనిద్వారా సంతృప్తిచెంది వుంటారు. అయితే వారంతా అనేక ప్రశ్నలను లోతుగా ఆలోచించాలి. భారతదేశంలో ఎన్నికలలో జయాపజయాలు ప్రజాస్వామిక పద్ధతుల్లో నిర్ణయించబడుతున్నాయా? ప్రజలు తమ ప్రజాస్వామికహక్కులను స్వేచ్ఛగా, చైతన్యయుతంగా వినియోగించు కోగలుగుతున్నారా? అధికారంకోసం పోటీపడుతున్నవారు, తమ హక్కులు వినియోగించు కోవటానికి ప్రజలను అనుమతిస్తున్నారా? ఈ విజయాలు, లేదా అపజయాలు సామ్రాజ్యవాద, భూస్వామ్య విధానాలకేమైనా అంతిమగీతం పల్కుతాయా? పాలకవర్గాల, ప్రభుత్వాల మద్దతుతో, కుమ్మక్కుతో విస్తరించిన అవినీతి భూతానికి దీనివలన ఏమైనా దెబ్బతగిలేది వుందా? ఈ ప్రశ్నలను తక్కువ అంచనావేసే, లేదా ఎగవేసే ప్రజాస్వామికశక్తుల ఏ ప్రయత్నాలైనా, స్వతంత్ర– ప్రజాస్వామిక వ్యవస్థ సాధనకోసం నిలిచిన పీడిత ప్రజల వాంఛలకు, ఆకాంక్షలకు తీవ్రంగా హాని చేస్తాయి. ప్రభుత్వాధికారంకోసం దోపిడీ పాలక వర్గాలు, వారి పార్టీలు పోటీపడుతూ నడుమ సామాన్య ప్రజానీకాన్ని బలిపశువులుగా చేయకుండా చూడటం మన కర్తవ్యంగా వుంటుంది. వారికి మార్గనిర్దేశం చేయటం, సంఘటితపరచటం, ఒక సరైన పంథాలో వారికి నాయకత్వం వహించటం నేటి అవసరం.'కర్నాటక' మనకు నేర్పుతున్నదిదే.

ooooo